రోడ్డు విస్తరణకు సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న వారితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మోత్కూరు, ఫిబ్రవరి 20 : ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న వారు తమ ఇండ్లను తొలగించుకొని సహకరించాలని మోత్కూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. మంగళవారం మున్సిపాలిటీలోని పలు ఇండ్లు, మడిగెల యజమానుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న వారు తొలగించుకోవడానికి అనేక సార్లు నోటీసులు ఇచ్చామన్నారు. గడువు దాటినా అలసత్వం ప్రదర్శిస్తున్న వారి ఇండ్లను తామే తొలగిస్తామని, అందుకు అయ్యే ఖర్చులను యజమానుల నుంచి వసూలు చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా ఇండ్లు, మడిగెలు తొలగించుకొని సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ శ్రవణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

భువనగిరిలో జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

మెమొంటోలు, జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 20 : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పెన్నర్స్ భవనంలో మంగళవారం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు టాలెంట్ టెస్టుల్లో పాల్గొనడంతో ప్రతిభ పెరిగి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఈ పరీక్షలో గుండాల ఆదర్శ పాఠశాల విద్యార్థి సీహెచ్.శివ ప్రథమ బహుమతి, భువనగిరి మండలం తుక్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి క్రాంతికుమార్ ద్వితీయ, రాజాపేట మండలం బేగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.శ్రావణి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. వారికి మెమొంటోలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేశ్, సత్యనారాయణ, భరణికుమార్, ఎన్.వెంకటేశ్వర్లు, ఎ.రమేశ్ పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు

కనకదుర్గాదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 20 : మండల కేంద్రంలో రూ.2కోట్లతో పునర్నిర్మాణం చేపట్టిన కనకదుర్గమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కనకదుర్గ, సంతోషి మాత, ఆంజనేయస్వామి, శివలింగం, గణపతి, సుబ్రమణ్యస్వామి విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. గ్రామంలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విగ్రహాలకు జలాభిషేకం చేసి మంగళ హారతులు పట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు ఏనుగు సురేందర్‌రెడ్డి, సుగంధిని, ఎంపీటీసీ యాస కవిత, మాజీ సర్పంచులు నగేశ్, పూర్ణచందర్‌రాజు, లక్ష్మారెడ్డి, బుచ్చిరెడ్డి, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఐలయ్య, మాజీ చైర్మన్లు దశరథగౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం

స్వామిగౌడ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

వలిగొండ, ఫిబ్రవరి 20 : మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన పరకాల స్వామి గౌడ్ ఇటీవల తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్య ఖర్చుల నిమిత్తం టాడీ కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.15వేల ఆర్థిక సాయాన్ని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి యాదయ్య, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాగీరు కిష్టయ్య మంగళవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మద్దెల రాజయ్య, పల్సం స్వామి, పరకాల వెంకటేశం, గుండు శేఖర్, పరకాల దశరథ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల చేయూత

మల్లారెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 20 : మండలంలోని పారుపల్లి రేషన్ డీలర్ తవిటి మల్లారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగుల రాజయ్య మాట్లాడుతూ మృతి చెందిన డీలర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందివ్వాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కందుల శంకర్, జిల్లా కార్యదర్శి వెంకటేశ్, డీలర్లు రమేశ్, ఇస్తారి, యాదయ్య, శోభ పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

చౌటుప్పల్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని 14వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం వలిగొండ రోడ్డులో నూతన శివాలయంలో శివస్వాముల పడి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సందగళ్ల విజయ, నాయకులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, సుర్వి నర్సింహగౌడ్, చెవ్వగోని వెంకటేశం గౌడ్, నర్సింహ, రవిగౌడ్ పాల్గొన్నారు.

మారేడు అడవుల్లో పాట చిత్రీకరణ

చిన్న మేడారంలో పాట చిత్రికరిస్తున్న దృశ్యం

రాజాపేట, ఫిబ్రవరి 20 : మండలంలోని చిన్న మేడారంలో ఆరాధ్య క్రియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మారేడు అడవుల్లో పాట చిత్రీకరించారు. ఈ సందర్భంగా చిన్న మేడారం గద్దెల వద్ద గుట్టల్లో షూటింగ్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్, రచయిత కోదారి శ్రీనివాస్, కెమెరామెన్ అజయ్, నటీనటులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో వైభవంగా లక్ష పుష్పార్చన

లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో మంగళవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామి, అమ్మవార్లకు సహస్రనామ పఠనాలతో అర్చక బృందం, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. లక్ష పుష్పార్చన పూజలను పాంచరాత్రాగమశాస్త్రం ప్రకారం సుమారు రెండు గంటల పాటు కొనసాగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. భూతపేత పిశాచాల బాధలు తొలగి ఇలలోక సుఖాలు, పరలోక మోక్షాలు సిద్ధించే హోమంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహస్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి కల్యాణ తంతును నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులు సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళ స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయం చెంతన గల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకు పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమల పాకులతో అర్చించి లలితా పారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 21,80,537 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.1,77,99,734

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి హుండీ ఆదాయం కోటిన్నర దాటిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం కొండ కింద వ్రత మండపంలో 22 రోజుల హుండీని లెక్కించగా.. రూ.1,77,99,734 నగదు, 99 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 170 గ్రాముల మిశ్రమ వెండి వచ్చిందన్నారు. వీటితోపాటు 397 అమెరికా డాలర్లు, 70 ఆస్ట్రేలియా డాలర్లు, కువైట్‌కు చెందిన 20 దినార్, ఇంగ్లాండ్‌కు చెందిన 5 ఫౌండ్స్, యూఏఈకి చెందిన 20 ధిరమ్స్, యూరప్‌కు చెందిన 15 యూరోలు, మలేషియాకు చెందిన 15 రింగిట్స్, కతార్‌కు చెందిన 5 రియల్స్, న్యూజిలాండ్‌కు చెందిన 50 డాలర్లు, నేపాల్‌కు చెందిన 10 రూపీస్ హుండీకి చేరినట్లు ఆయన వెల్లడించారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్, ఎంసీసీ తదితర టీముల అధికారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. బృందాలకు కేటాయించిన విధులు, నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులపై ముందస్తుగా ఆధారాలు సేకరించాలని, రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని సూచించారు. ప్రజల నుంచి సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. సీజ్ చేసిన డబ్బు, వస్తువులను ఈఎస్ఎంఎస్ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కోడ్ అమల్లోకి వచ్చిన 24, 48, 72 గంటల్లో చేసే విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎ.భాస్కర్‌రావు, జి.వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, తాసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ టీముల సభ్యులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథరెడ్డి శిక్షణ నిర్వహించారు.

ప్రకృతి వనరులు, భూగర్భ జలాల పరిరక్షణకు కృషి చేయాలి

ప్రకృతి వనరులు, భూగర్భ జలాలను పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉన్నదని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. భూగర్భజలాల వినియోగం, నియంత్రణ, నిర్వహణపై కలెక్టరేట్‌లో నిర్వహించిన పారిశ్రామిక, వాణిజ్యవేత్తల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాల వినియోగానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అన్నారు. ఎంత మేరకు భూగర్భ జలాలను వినియోగించుకున్నారో అంత పరిమాణంలో వర్షపు నీటిని కృత్రిమ పద్ధతిలో రిచార్జ్ చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల్లో బోరు బావి తవ్వుటకు సంబంధిత అధికారి నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి పేర్కొన్నారు. భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతికుమార్ జిల్లాలో భూగర్భ జలాల లభ్యత స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

చౌటుప్పల్‌లో అక్రమ కట్టడాల తొలగింపు

అక్రమ కట్టడాలను తొలగిస్తున్న జేసీబీ

చౌటుప్పల్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని సర్వే నెంబర్ 113లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను మంగళవారం తొలగించారు. కొంతమంది ఆక్రమణదారులు కబ్జాకు పాల్పడుతున్నారని స్థానికులు కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి సూచనల మేరకు స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులు జేసీబీతో అక్రమ కట్టడాలను కూల్చివేయించారు.

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా పురుషోత్తంరెడ్డి

నకిరేకంటి మొగులయ్య

రామన్నపేట, ఫిబ్రవరి 20 : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా రామన్నపేట ఎస్‌టీఓ గంగుల పురుషోత్తంరెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ గెజిటెడ్ అధికారుల సంక్షేమానికి, మెరుగైన పీఆర్‌సీ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఆలేరు మండల సర్వసభ్య సమావేశం

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 20 : మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్యానంద్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మొగులయ్య

నకిరేకంటి మొగులయ్య

రామన్నపేట, ఫిబ్రవరి 20 : బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ నకిరేకంటి మొగులయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తన నియమకానికి సహకరించిన కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బంగారు శృతి, కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీవీ శ్యాంసుందర్‌రావుకు, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, నలగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మందనపల్లిలో పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఎంపీపీ అశోక్

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 20 : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో అందజేసిన పరీక్ష ప్యాడ్లను మండలంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ గంధమల్ల అశోక్ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, సయ్యద్ పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 20 : మండలంలోని ధర్మోజిగూడెం గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవాలయ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొంతం భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా గునుకంటి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా చెన్నోజు రాఘవేంద్రాచారి, జంగం నవీన్, పిసాటి దామోదర్‌రెడ్డి, బద్రి రామలింగం, కోశాధికారిగా కొంతం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులుగా జక్కిలి శ్రీశైలం, ఊదరి శ్రీనివాస్, జువ్వి నరసింహ, పగిళ్ల కిరణ్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, నారాయణ, లింగస్వామి, గౌరవ అధ్యక్షులుగా బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సమయ పాలనతో ఒత్తిడిని జయించొచ్చు

సమావేశంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్

బొమ్మలరామారం, ఫిబ్రవరి 20 : విద్యార్థులు సమయపాలన, క్రమశిక్షణ పాటించడం వల్ల నిజ జీవితంలో ఒత్తిడిని జయించవచ్చని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని మల్యాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే విద్యార్థులు భయపడొద్దని, పాఠ్యాంశాన్ని పూర్తి అవగాహన చేసుకోవాలని అన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా బాగా చదివి జీవితంలో ఉన్నతంగా ఎదుగాలని సూచించారు.

జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థిని

భవ్య శ్రీ

వలిగొండ, ఫిబ్రవరి 20 : మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థిని పల్సం భవ్యశ్రీ ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 83.56 పర్సంటైల్ సాధించి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రాము మంగళవారం తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భవ్యశ్రీ అత్యుత్తమ మార్కులతో జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించిందని ఆయన పేర్కొన్నారు. మంచి మార్కులతో పాఠశాలకు పేరు తెచ్చిన భవ్యశ్రీని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సిరిపురంలో భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

- నేడు స్వామివారి కల్యాణ మహోత్సవం

రామన్నపేట: సిరిపురంలో ముస్తాబైన మల్లికార్జునస్వామి దేవస్థానం

రామన్నపేట, ఫిబ్రవరి 20 : మండలంలోని సిరిపురం గ్రామంలో భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభోపేతంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, చతుర్వేద స్వస్తి తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం స్వామివారికి రుద్రాభిషేకం, మంగళ స్నానాలు, విశేష అలంకరణ, హోమం అనంతరం సాయంత్రం 5గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏళ్ల బుచ్చిరెడ్డి తెలిపారు. కల్యాణానికి నకిరేకల్, భువనగిరి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించనున్నారు.

ఏసీబీ వలలో పంచాయతీ రాజ్ ఏఈ

- 5వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఏసీబీ అధికారులకు పట్టుబడిన మేళ్లచెర్వు పంచాయరాజ్ ఏఈ రంగరాజు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 20 : పంచాయతీ రాజ్ ఏఈ రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ సంఘటన మంగళవారం హుజూర్‌నగర్‌లో జరిగింది. దీనికి సంబంధించి ఏసీబీ ఉమ్మడి నల్లగొండ డీఎస్పీ ఎంవీ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెర్వు మండల పంచాయరాజ్ ఏఈ కోసూరి రంగరాజు పనిచేస్తున్నాడు. అదే మండలంలోని కప్పుల కుండా తండాకు చెందిన ధారావత్ కృష్ణ కాంట్రాక్ట్ పనుల కింద పలు గ్రామాల్లో కరెంట్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేశాడు. దానికి సంబంధించిన ఎంబీలు చేసే విషయంలో రంగరాజు రూ.5 వేలు లంచం డిమాండ్ చేశాడు. దాంతో కృష్ణ ఈ నెల 30 న అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల ప్రకారం మంగళవారం హుజూర్‌నగర్ పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయంలో కృష్ణ ఏఈ రంగరాజుకు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. ప్రభుత్వం అధికారులు లంచం అడిగితే 91543 88918 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని డీఎస్పీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- ఆరుగురికి తీవ్ర గాయాలు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 20 : మండలంలోని ఎల్లంబావి గ్రామ పరిధిలో 65వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్ వైపు వెళ్తున్న సిమెంట్ లారీని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న నిజాంపేటకు చెందిన మహేందర్, అతని భార్య దివ్య, కుమారుడు భార్గవ్, కృష్ణా జిల్లా పల్లవరం గ్రామానికి చెందిన నరేశ్, అతని భార్య మౌనిక, కూతురు నిఖితకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

22నుంచి వేంకటేశ్వర, లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

మోత్కూరు, ఫిబ్రవరి 20 : మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురంలో వేంకటేశ్వర స్వామి, లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి 25 వరకు జరుగనున్నాయని ఆలయాల ఉత్సవ కమిటీల ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న మంగళతోరణాల అలంకరణ, సేవాకాలం, 23న విశ్వక్సేనారాధన, అంకురార్పణం, 24న లక్ష్మీ నర్సింహస్వామి గుట్టపైకి వేంచేపు చేయుట, విశ్వక్సేనారాధన, రాత్రి 7గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు 24న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు హాజరు కానున్నారని తెలిపారు.

నేడు జిల్లాలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పర్యటన

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 20 : జిల్లాలోని బొమ్మలరామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి మండల కేంద్రాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి బుధవారం పర్యటిస్తారని టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు మిరియాల దామోదర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు బొమ్మలరామారం మండల పరిషత్ కార్యాలయం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు తుర్కపల్లి, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు యాదగిరిగుట్ట, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు భువనగిరి మండల పరిషత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థి సంఘా లు కలిసి సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఇక్కుర్